# ప్రోత్సాహం

మనమీనాడు అత్యున్నత స్థితిలో ఉన్న చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లమో - నెంబర్ వన్ స్థానంలో ఉన్న బిజినెస్ టైకూన్లమో - కళాకారులమో కావచ్చు....

లేదా...

ఇంకెవరూ అందుకోని ఉన్నత శిఖరాలను అవలీలగా అధిరోహించి - అలవోకగా కిందికి చూస్తే - ఇన్నాళ్ళూ మనకి తమ అండదండలందించిన పాత మిత్రులందరూ... మన కళ్ళకి చీమల్లానో, దోమల్లానో కన్పించనూవచ్చు !

మనమీ స్థితికి వచ్చామంటే - పైకి... అది మన 'స్వయంకృషి' అని ఎంతచెప్పుకున్నా- ఒక్కో సంక్షోభంలో - ఎవరో ఒకరు మనకి చేయూతనందించి, 'ఫుట్ హోల్డ్'గా నిలిచి మన శిఖరావరోహణని సులభతరం, సుగమం చేశారన్న విషయం..... మనం అతి సులువుగా మరిచిపోనూ వచ్చు !

ఒకానొకప్పుడు....

మనమేమిటో - మన ఉనికెక్కడో - మన గొప్పతనమేమిటో... ఎవరికీ తెలీని సమయంలో... మనలో నిగూఢంగా దాగి ఉన్న టాలెంట్‌ని గుర్తించి మనల్ని ప్రోత్సహించి - మన వెన్నుదట్టిన 'గాడ్‌ఫాదర్స్'ని, ఆ తర్వాత పలకరించడం... మనకి నామోషీగానో... హోదాకి భంగకరంగానో... మనం భావించనూవచ్చు.

కానీ....

**ప్రోత్సాహం....**

**కామన్‌మాన్‌ని 'సూపర్‌మాన్' చేస్తుంది!**

**కూరుకుపోతూన్న మనిషి పాదాలని నిలదొక్కుకునేలా చేస్తుంది!**

అసలెవర్నీ ప్రోత్సహించకుండా 'నిర్లిప్త ం'గా ఉండే మనుషుల కన్నా - ఎదుటివాణ్ణి అడుగడుగునా అధైర్యపరుస్తూ వాడి శక్తియుక్తుల్ని 'నిర్వీర్యం' చేసే మనుషులు... అతి ప్రమాదకరమైన వాళ్ళు!

పోతే...

తమని ప్రోత్సహించిన వాళ్ళపట్ల... మనుషుల్లో 'కృతజ్ఞత' లేకపోయినా సరిపెట్టుకోగలిగే మనం - 'కృతఘ్నత'ని చూసినప్పుడు మాత్రం... భగ్గుమంటాం - సిగ్గుతో చితికిపోతాం !

**'కృతజ్ఞత' - మనిషి గుండెను ఆర్ద్రం చేస్తే.... 'కృతఘ్నత'- మనిషి మనసుని రగిలిస్తుంది !**

సరిగ్గా ఇలాంటప్పుడే....

ప్రోత్సాహం - ఎంత ప్రతిఫలాపేక్షలేనిదైనా - అపాత్ర దానమైందని బాధపడిపోతాం!

నిజానికి....

ఎదుటివ్యక్తిలో ఏ కాస్త 'స్పార్క్' ఉన్నా... దాన్ని నల్గుర్లో ఫోకస్ చేసే వ్యక్తి - ఎవరి గుర్తింపునీ, కృతజ్ఞతనూ, గురుదక్షిణనీ కోరుకోడు సరికదా...

తను వెలికితీసిన మాణిక్యాల తళతళలు చూసుకుని మురిసిపోతాడు !

మరుగునపడ్డ మరో వజ్రాన్ని సానపట్టేందుకు సంసిద్ధుడవుతాడు!

1-5-1995